# మోషే

ఐగుప్తులో (ఈజిప్టు) హెబ్రీయుల యింట మోషే జన్మించి నప్పటికీ ఈజిప్టు నేలిన రాజు కుమార్తె యితణ్ణి పెంచింది (నిర్గమ 2:1-10). మోషే ఈజిప్టులో పెరిగిన కాలంలో హెబ్రీయుల పట్ల ఈజిప్టువారు కఠినంగా వ్యవహరించిన తీరును చూచాడు. ఒకరోజు మోషే ఈజిప్టు దేశస్థ నొకణ్ణి చంపివేసి మిద్యాను దేశానికి పారిపోయాడు. మోషే మిద్యానులో వున్నప్పుడు ఐగుప్తు దాస్యం నుంచి హెబ్రీ ప్రజలను విడిపించడానికి మోషే అక్కడికి వెళ్లాలని యెహోవా అతనితో చెబుతాడు (నిర్గమ 3:1-4:17). ఆ విధంగా మోషే ఈజిప్టుకు తిరిగి వచ్చాడు. ఈజిప్టు రాజు హెబ్రీ ప్రజలను దాస్యంనుంచి విడుదల చేయని పక్షంలో దేశం మీదకు యెహోవా తెగుళ్లను రప్పిస్తాడని మోషే అతణ్ణి హెచ్చరించాడు. చివరకు, మోషే హెబ్రీ ప్రజలను ఈజిప్టు నుంచి బయలుదేరజేసి వారిని ఎర్ర సముద్రం దాటించి ఆవలకు నడిపించాడు.

మహత్కార్యాలు జరిగించిన మోషే గొప్ప నాయకుడు (నిర్గమ 15:22-25). అయితే, మోషేకు అనేక ఇతర బాధ&యతలు కూడ వున్నాయి. పది ఆజ్ఞలను యితర కట్టడలను యిచ్చేందుకు దేవుడు మోషే నెన్నుకున్నాడు. ఇశ్రాయేలు ప్రజల జీవనవిధానానికి వారి ఆరాధ నా నియమావళికి సబంధించిన ఈ ఆజ్ఞలు కట్టడలు విధులు నిర్గమకాండము (20-40), లేవీ యకాండము, సంఖ్యాకాండము, ద్వితీయోపదేశకాండములలో వున్నాయి. దేవుని తీర్పు, ఆయన వాగ్దానాల గురించి ప్రకటించిన మోషేను ప్రవక్త అని కూడ పిలిచారు (ద్వితీ 34:10).

మోషేను యాజకుడని పేర్కొనకపోయినప్పటికి ప్రత్యక్షపు గుడార నిర్మాణ, ఇశ్రాయేలు ప్రజల ఆరాధన గురించి బల్యర్పణల గురించి దేవుడు (యెహోవా) మోషేకు వివరించాడు. ఇశ్రాయేలు ప్రజలందరి తరపున మోషే యెహోవాకు మొరపెట్టాడు (సంఖ్యా 14:11-20). ప్రత్యక్షపు గుడారంలో మోషే యెహోవాను కలుసుకున్నాడు (నిర్గమ 33:7-11).

మోషే వివాదాలను (వ్యాజ్యేలను) కూడ పరిష్కరించాడు. దేవుని ఆజ్ఞల ప్రకారం ప్రజ లకు న్యాయం చెప్పేందుకు మోషే న్యాయాధిపతులను (అధికారులను) నియమించాడు (నిర్గమ 18:13-26). వాగ్దానదేశమైన కనానుకు చేసిన ప్రయాణాల్లో ఇశ్రాయేలీయుల నెదిరించిన వారితో మోషే యుద్ధాలు చేశాడు (సంఖ్యా 21:21-35).

యెహోవా మోషేను వాగ్దానదేవంలోనికి అనుమతించలేదు (సంఖ్యా 20:12; ద్వితీ 3:2 3-29). అయితే యొర్దానుకు అవతల వున్న నెబో పర్వతం మీద నుంచి మోషే కనాను దేశాన్ని చూడ గలిగాడు (ద్వితీ 32:48-52).

ధర్మశాస్త్రాన్ని అందించిన వ్యక్తి మోషే అని క్రొత్త నిబంధన గ్రంథం తెలియజేస్తుంది (మత్తయి 19:7; యోహాను 1:17;2 కొరింథీ 3:7-14). మోషేను విశ్వాసవీరునిగా (హెబ్రీ 3: 2; 11:23-29), ప్రవక్తగా (అ.కా. 3:22,23) వర్ణించారు.